


# చంటున్నయ్యా- శతదినోత్సవ వేడుకా!

తెల్లారితే రెండు టెస్టులు. ఇప్పటి వరకూ కొంచెం కూడా చదువుకోడం కుదరలేదు. మళ్లీ రేపే నోట్ బుక్సన్నీ నీటుగా వున్నాయో లేదో చెకింగుట. నా పుస్తకాలెలా వుంటాయో మా క్లాసు టీచరుకి బాగా తెలుసు. అందరికన్నా ముందు నావే చూస్తుంది. ఎలారా దేవుడా అని ఆలోచిస్తుంటే చిన్నారి గుర్తొచ్చింది. దానితో మంచిగా వుండాలే గానీ ఎంత పనయినా చేసేస్తుంది. మా అమ్మవిగా మా తల్లివిగా అని అడగాలి. అదయితే ఎవరినీ ఏదీ అడగదు. దానికెవ్వరి సాయువూ అవసరమే పడదు. నాకయితే ఎవరి

సాయమన్నా అడగడానికీ బాధ లేదు. ఎవరిపనన్నా చేసిపెట్టడానికీ బాధలేదు. అమ్మంటుందీ ''నువ్వన్నీ నేలకిపోయేవినెత్తికిపొంకుంటావు గాబట్టివూరందరిసాయమ్వూ కావల్సొస్తుందీ. అందరికీ ఏం అవసరం ?'' అని. చిన్నారి నా పుస్తకాలన్నీ చెక్‌చేసి అట్టలు మారుస్తోంది. నేనేమో రెండు పాయమ్స్ నేర్చుకుంటున్నా. ఇంతలోకీ దిగబడ్డాడు చంటన్నయ్య. అదే ప్రభాకరం అన్నయ్యా వాళ్ల తమ్ముడు.

చంటన్నయ్యంటే మాకిష్టమే గానీ ఎప్పుడూ కోపం తెప్పిచ్చే పన్లే చేస్తాడు. సినిమా డబ్బా లుచ్చుకుని ఏదో ఓ పల్లెటూరెల్లిపోయి రెండేసి నెలలుండి వస్తూ వుంటాడు. అతనుద్యోగమే అదిట్లే! ఒకవేళపిక్చరు బాగా ఆడకపోతే నాత్రో జులకే తిరిగొచ్చేస్తాడు. ఇంకవచ్చాడంటే అన్నీ సినిమా కబుర్లే. ఏ సినిమా ఎప్పుడొస్తోందో, ఏ హీరోయిను కొత్త కారు కొనుక్కుందో, ఏ షూటింగులో ఎవరెవరు దెబ్బలాడుకున్నారో అన్నీ కళ్లతో చూసినట్లు చెప్తాడు. పైగా రైల్లో వస్తుంటే ఎస్.వి. రంగారావు పలకరించాడనీ, ఇలా అన్నీ కోతలే. కానీ నాకు సినిమా కబుర్లంటే చచ్చే ఇష్టం. అన్నీ నిజాలే అనుకుని వినడం ఎందుకు ? అబద్ధాలని తెలిసి సరదాకి వినకూడదా ?

తనొచ్చాడని తెలిస్తే నాన్న అమ్మని కేకలేస్తారు. వీడొస్తే పిల్లల చదువులు గుంటకట్టి గంట వాయించేడవే, అందరూ తలో సినిమా డబ్బాతో తిరగాలీ అని. ఏదోలే పాపం పిల్లలతో ఆడుకోడానికొస్తాడని సగం సార్లు చంటన్నయ్య వచ్చినట్లు అమ్మ నాన్నకి చెప్పనే చెప్పదు. వాళ్ల కంపెనీ సినిమాలు తడవకి రెండు మూడన్నా బెజవాడలో ఎప్పుడూ ఆడుతూ వుంటాయిగా. ఇంక రేపో మాపో సినిమా మార్చేస్తారనగా హాలు ఖాళీ ఖాళీగా వుంటుంది కదా. అప్పుడు మాకు ఫ్రీ పాసులు తెచ్చిస్తాడు వాళ్ల మానేజర్ని అడిగి. అలా లేకిగా ఫ్రీపాసులు కోసం దేబిరించడం తప్పని అమ్మ కోప్పడుతుంది గానీ అందులో లేకితనం ఏవిటో నాకర్థమే గాదు. ఎలాగూ హాలువాడికి సినిమా ఆడకతప్పదు కదా. ఖాళీ సీట్లలో మేం కూర్చుంటే సినిమా హాలు వాడికొచ్చిన నష్టమేముంటుందీ? మనం టికెట్టు కొన్లేదని ఎవరికన్నా ఎందుకు తెలుస్తుందీ? ఏంటో అమ్మకన్నీ అర్థం పర్థంలేని ఆలోచనలు.

నేనూ చిన్నారీ చంటన్నయ్యని చూసి కూడా చూడనట్లుగా నటిస్తూ తలొంచుకుని మా పనిలో మేం వున్నాం. అసలెందుకు మాట్లాడాలిట ఓపక్క వళ్లు మండిపోతుంటే !

''పిన్నేదే సుశీలా?'' అనడిగాడు.

''వెళ్లి వెతుక్కో ! ఎందుకొచ్చావసలికి ?'' అనడిగా.

''పిన్ని నన్ను రమ్మందిట సావిత్రొదిన చెప్పింది'' అన్నాడు.

''ఏవన్నా గారెలొండి మూతెట్టి తినడానికి రమ్మందనుకున్నావా ? వెళ్లిపో

మాక్కనపడకు, నీతో మాట్లాడితే మహాపాపం!'' అని ఇద్దరం ఒక్కసారిగా కోపంగా అరిచాం. ఇందూ, బుజ్జీ మీదపడి బాదడం మొదలెట్టారు.

''చచ్చాన్రోయ్ తల్లులారా ! ఎందుకర్రా బాబూ నా మీదంత కోపం ! వాళ్ళ నాపమని చెప్పవే సుశీలమ్మ తల్లీ'' అని గోలపెట్టాడు. ఆపండే అనగానే వాళ్ళిద్దరూ ఆపేశారు బాదడం.

''ఏం చేశావా ? నీకసలు గాపకం కూడా లేదన్నమాట. పోనీ గారెల పిండి వంటంటే గాపకం వస్తుందేమో ! ఆవేళ వెళ్ళేటప్పుడు ఎంతాశపెట్టావు ! లక్ష్మీ టాకీసులో జయసింహ సినిమాకి పాసులు తీసుకొస్తాను. మా నలుగురినీ రెడీగా వుండమన్నావా లేదా ? మేమంతా పిచ్చాళ్ళలాగా ఇస్త్రీ బట్టలేసుకుని రెడీ అయిపోయి ఎంతసేపు ఎదురుచూశావో ! వాడి మాటలు నమ్మమని మీకెవరు చెప్పారురా అంటూ అమ్మ నవ్వడం. ఈసారి నీకు మంచినీళ్ళు కూడా ఇయ్య నియ్యం.''

''అర్రెర్రెర్రె ! ఎంత పొరబాటయిపోయిందే తల్లీ ! అదా మీ కోపం. నే మర్చేపోయా. ఆవేళ ఆఫీసుకెళ్ళగానే డబ్బాలుచ్చుకుని కంచికిచెర్ల పొమ్మన్నారు. పిక్చరేం బాగా పోలా ! ఒక్క ఏభై రూపాయలు కూడా రాలా!''

''ఎవరికి నీకా ?''

''అవును నాకే మరి! హౌస్‌ఫుల్లయితే గదా నాకు నాలుగు రూపాయిలొచ్చేది మధ్యలో కుర్చీలేయించడానికి పర్మిషనిచ్చి ! అసలు హాలేనిండకపోతే పై డబ్బులేం వస్తాయి ?''

''మంచి పనయింది అసలు నీ మొహం చూస్తేనే తెలుస్తోంది పిక్చరాడలేదని. మమ్మల్ని మోసం చేసి మొహం తప్పిస్తే ఏమవుతుంది మరి?''

''ఇంక తిట్టకండే తల్లీ ! సినిమాదేవుంది టిక్కట్టు కొనుక్కునయినా చూడచ్చు. ఈ ఆదివారం శతదినోత్సవం చేస్తున్నారు. ఎంత దర్జాగా వుంటుందో, శ్రీరంజనొస్తుందీ, రామారావొస్తాడూ.''

నే అడిగా ''అంజలీదేవొస్తుందా?''

''ఆవిడ రాకపోతే శతదినోత్సవేవిటీ ? బోల్డుమంది పోలీసులొస్తారు తెల్సా?''

''వాళ్ళెందుకూ మధ్యలో''

''శతదినోత్సవం చూద్దామని వచ్చినవాళ్ళని తన్నేందుకు!'' చిన్నారి అందుకుంది ఎక్కిరిస్తూ.

''అలాగే నవ్వండి. రేపు పాసులు తెచ్చాక మీరే మళ్ళీ నావెంట పడతారు!''

ఇంతలోకీ అమ్మ వచ్చింది.

''ఏరా చంటీ ! ఆవేళ వీళ్ళు నా ప్రాణం తోడేశారు. ఓసారి చూసిన సినిమాయే కదర్రా

అన్నా విన్నారా ? నీకు చేతకానపుడు వీళ్లకి సినిమా అని రేప్పెట్టడం ఎందుకు ? ఏదో ఓటి వాగి వాగి నా ప్రాణం మీదకి తెస్తున్నావింక వూరుకోనిలా చేస్తే!''

''ఏంచెయ్యను పిన్నీ ! హౌస్‌ఫుల్ నడుస్తోందని మానేజరు పాసులివ్వనన్నాడు. ఇప్పుడు కూడా టిక్కట్లు దొరకటల్లా. నీకెందుకు! కష్టపడయినా సరే శతదినోత్సవానికి తీసికెడతాగా!''

''సినిమాకి పాసు తేలేక పోయావుగానీ శతదినోత్సవానికి తీసికెడతావా ! అసలు నువ్వు మళ్లీ కనిపించావంటే నలుగురం కలిసి చంపేస్తాం''

''ఎంతొట్టు పడితే అంతొట్టు. అందర్నీ తీసికెళ్లడం కుదరదుగానీ నువ్వూ చిన్నారీ రెడీగా వుండండని'' చెత్త కబుర్లన్నీ చెప్పి అమ్మచేత కమ్మగా నాలుగు దోశెలేయించుకుని తిని వెళ్లిపోయాడు.

ఇన్ని తిట్లు తిన్నాడు కదా ఈసారి మాట నిలబెట్టుకుంటాడేమోలే అని నాకు కాస్త నమ్మకం కుదిరింది. మర్నాడు స్కూల్లో కూడా అందరికీ చెప్పేశాను సోమవారం విశేషాలన్నీ చెప్తానని. శనివారం స్కూలు నించి తిన్నగా ఇంటికి రాకుండా లక్ష్మీ టాకీసు మీదుగా వచ్చాం. ఆ రోడ్డు మీద ఎంత జనవో, ఎన్ని జండాలు రంగురంగులవి కడుతున్నారో. బోల్డు బోల్డు బొమ్మలు ఎక్కడ చూసినా కత్తుచ్చుకుని ఎన్టీరామారావు బొమ్మలే ! ఇంటికొచ్చి చూస్తే అన్నయ్య రాలేదంది అమ్మ. అంటే ఈసారి కూడా ముంచేశాడని తెల్సిపోయిందిగా. ఇంక నాకు ఎంత ఏడుపొచ్చే సిందో చెప్పలేను. కానీ అమ్మకంట పడ్డానంటే నవ్వుతుంది. ఈ బాధకి తోడు అదో బాధ. ఇంట్లో వుండ బుద్ధికాక నెమ్మదిగా ఇల్లుగల వాళ్లింట్లోకెళ్లా.

నేనూ అత్తయ్యగారూ వుయ్యాల బల్ల మీద వూగుతూ కబుర్లు చెప్పుకుంటున్నాం. ఆవిడ గుల్ల శనగపప్పు వుండలూ చక్కిలాలూ పెట్టారు. అలా వున్నావేం అనడిగితే మా కథ మొదట్నించీ చెప్పుకొస్తున్నా. అప్పుడే చీకటి పడుతోంది కదా అందుకే అత్తయ్యగారు హాల్లో లైట్లు కూడా వెయ్యలేదు. ఇంతలోకీ మావయ్యగారి కారు హారను వినిపించింది. ఇపుడే వచ్చేస్తున్నారేంటబ్బా ఈయన అని ఆవిడ అనుకుంటూ ''అమ్మాయ్! పరిగెత్తుపరిగెత్తు అన్ని లైట్లూ వేసెయ్యి. ఏవిటో మావయ్యగారు పెందలాడే వచ్చేస్తున్నారు'' అని ఖంగారు పడ్డారు. పరిగెత్తి హాలులో అన్ని పక్కల లైట్లూ వేసేసేటప్పటికి సినిమా హాలులా అయి పోయింది. ఇల్లంతా లైట్లేయకపోతే మావయ్యగారికి కోపం వస్తుందిట. వూరికే కరెంటు కాల్చడం ఎందుకని అత్తయ్యగారుద్దేశం, అందుకని ముందే డ్రైవరుకి ఇంటి కొచ్చేటప్పుడు హారను కొట్టుకుంటూ రమ్మని చెప్పుంచుతారన్న మాట.

గబగబా బయటకొచ్చేస్తుంటే గుమ్మంలోనే ఎదురయ్యారు మావయ్యగారు. వెనకాలే

బోల్డు పుస్తకాలతో వాళ్ల గుమస్తాగారు.

''ఏం పాపమ్మా వెళ్లిపోతున్నారేం ! అందరూ బాగా చదువు కుంటున్నారా ?'' పాపం ఆయనే పలకరించారు. ''బానే చదువుకుంటున్నాం అండీ. మీరింత తొందరగా వస్తారనుకోక అత్తయ్యగారితో ఏవో కబుర్లు చెప్తున్నా''

''అట్లా ఎందు కనుకోవాలి ! ఇదంతా మనిల్లే! ఎక్కడన్నా ఎంతసేపన్నా వుండచ్చు'' అన్నారు. ఇంతలోకీ మంచినీళ్ల గ్లాసుతో అత్తయ్యగారొచ్చారు. ''పాపం దిగులు పడ్డదీపూట సుశీలమ్మ. రేపు శతదినోత్సవం చూపిస్తానని ఆశపెట్టాడంట వీళ్ల బంధువుల పిల్లకాయొకడు. ఇంతవరకు రాకపోయెనని ఎదురు చూస్తూ ఉన్నది''

''ఏం సినిమా తల్లీ''

''అదే లక్ష్మీ టాకీసులో జయసింహ'' అని చెప్పా. వెనక్కి తిరిగి ''పంతులుగారూ ! మనకి ఇన్విటేషను వచ్చిందా చూడండి'' అనడిగారు. వీధి గదిలోకెళ్లి బల్లమీద వెతికి రెండు నిమిషాల్లో తిరిగి వచ్చారాయన చేతిలో చందమావంత కార్డుతో. ''ఇంకనేం ! పంతులుగారూ! మీరు రేపు పిల్లల్ని కారులో తీసికెళ్లి చూపించి జాగ్రత్తగా తీసుకురండి. చాలా జనాలుంటారు జాగ్రత్త'' అని చెప్పి ఏం పాపమ్మా నీ దిగులు పోయినట్లేనా అనడిగారు.

ఇంకెక్కడ దిగులు ! మర్నాడు మేం కారులో దిగుతుంటే మావయ్యగారే వచ్చారనుకుని హాలువాళ్లు ఎదురొచ్చారు. ఎన్ని మర్యాదలు చేయించుకున్నావో ఆయన పేరు చెప్పి. అంజలీదేవి శ్రీరంజని అయితే ఎంతందంగా నిజ్జం దేవతల్లాగా వున్నారు. అందర్నీ చక్కగా దగ్గిర్నించి చూసి ఆటోగ్రాఫులు తీసుకుని ఇంక ఎగురుకుంటూ వచ్చినట్లొచ్చాం ఇంటికి. అందరం అన్నాలు తింటుంటే బయట నించి పిన్నీ అని చంటన్నయ్య గొంతు వినపడింది. అమ్మ మమ్మల్ని కదలద్దని బయటికి పరిగెత్తింది.

''పిన్నీ ! చిన్నారి చెప్పింది నిజవే. పిచ్చి జనాలు. లాఠీచార్జీ అయింది. చాలా మందికి దెబ్బలు తగిలాయి. అంజలీదేవీ రాలేదు. శ్రీరంజనీ రాలేదు. పాపం జరాలుట ఇద్దరికీ!''

''ఎవరూ రాకపోతే జనాలు నిన్ను చూడ్డానికొచ్చారా? నీ వెధబద్దాలు మానవు. పిల్లల్ని పాపం ఇంటివాళ్ల గుమస్తాగారు కార్లో తీసికెళ్లి తీసుకొచ్చారు. నువ్వు నాద్రో జులీపక్కకి రాకు వాళ్ల కంట పడ్డావంటే బతకనీరు'' అన్చెప్పి వాకిట్లోంచే పంపేసింది.